సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం ; 1 ; ఏప్రిల్ ; 2024



నాటు తుపాకుల అప్పగింత

చింతపల్లి, రాజవొమ్మంగి మండలాల్లో గిరిజనులు 26 నాటు తుపాకులను ఆదివారం పోలీసులకు అప్పగించారు. 8లో



ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఈస్టర్ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 9లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
పాడేరు, అరకు	6.13	4.36
రంపచోడవరం	6.28	4.41

న్యూస్‌రీల్

మామిడితోటలో అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న మామిడితోట

చింతూరు: మండలంలోని పోతనపల్లిలో ఆదివారం మధ్యాహ్నం పది ఎకరాల మామిడితోటలో అగ్ని ప్రమాదం సంభవించింది. సయ్యద్ ఆసిఫ్‌కు చెందిన తోటలో ప్రమాదవశాత్తూ ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక యువకులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాపుతో ఉన్న సుమారు రెండు వేల మొక్కలకు అగ్ని కీలల వల్ల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

బొర్రాకు పర్యాటకుల తాకిడి



బొర్రా గుహల వద్ద పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు తాకిడి పెరిగింది. శనివారం రెండు వేల మంది సందర్శించగా, రూ.1.50 లక్షలు, ఆదివారం 1300 మంది తిలకించగా రూ.1.13 లక్షల ఆదాయం వచ్చిందని టూరిజం మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. జిప్‌లైన్‌పై 92 మంది విహరించగా రూ.46 వేల ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి కల్పనలో 'రాజవొమ్మంగి' ప్రథమం

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని 11 మండలాల్లో ఉపాధి హామీ పథకం పనుల కల్పనలో రాజవొమ్మంగి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఏపీవో సురేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి మండలంలో 6.54 లక్షల పనిదినాలు కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి మండలంలో ఇంత పెద్ద ఎత్తున పనుల కల్పన ఇదే మొదటి సారి అన్నారు. వేతనదారులు 3,194 మంది వంద రోజుల పని పూర్తి చేశారన్నారు. ప్రతి కుటుంబానికి సగటున 77.48 రోజుల పని కల్పించినట్టు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 15.84 కోట్లు వేతన రూపంలో ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు ఆయన వెల్లడించారు.

అన్ని మతాలు స్నేహభావంతో మెలగాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: అన్ని మతాల వారు స్నేహభావంతో మెలగాలని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రంజాన్ పురస్కరించుకుని స్థానిక మజీదు వద్ద ముస్లిం సోదరులు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముస్లిం కమిటీ సభ్యులు షేక్ మీరా,మజీద్ ఇమామ్ ఎండీ ముజీబ్,కోఆప్షన్ సభ్యులు నజర్‌వలీ, నూరు, వల్లీ, సత్తార్ ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎంపీపీలు అనూషదేవి, కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత పాల్గొన్నారు.

స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం (విశాఖ) : ప్రయాణికుల సౌకర్యార్థం పలు రద్దీ మార్గాల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో నడుస్తున్న ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- విశాఖపట్నం – సికింద్రాబాద్ – విశాఖపట్నం (08579/08580) వీక్లీ స్పెషల్ జూన్ 27 వరకు పొడిగించారు.
- విశాఖపట్నం – తిరుపతి – విశాఖపట్నం (08583/08584) వీక్లీ స్పెషల్ జూన్ 25 వరకు పొడిగించారు.
- విశాఖపట్నం – బెంగళూరు – విశాఖపట్నం (08543/08544) వీక్లీ సూపర్‌ఫాస్ట్ స్పెషల్ జూలై 1 వరకు పొడిగించారు.
- విశాఖపట్నం – కర్నూలు సిటీ – విశాఖపట్నం (08585/08586) వీక్లీ స్పెషల్ జూన్ 26 వరకు పొడిగించారు.

జోష్



ధోనీ.. ధోనీ..



రిషభ్ పంత్‌ను అభినందిస్తున్న అక్షర్‌పటేల్



షాట్‌కు ప్రయత్నిస్తున్న డీసీ బ్యాటర్ వార్నర్



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యుల కేరింతలు





వికెట్ తీసిన ఆనందంలో డీసీ ప్లేయర్స్



చీర్ బ్యూటీస్







విశాఖ స్పోర్ట్స్: ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ మ్యాచ్ విశాఖ అభిమానులకు ఫుల్‌జోష్‌ను అందించింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. ఆదివారం సెలవుదినం కావడంతో నగర క్రికెట్ అభిమానులు వైఎస్సార్ స్టేడియానికి పోటెత్తారు. ఫలితంగా స్టేడియం దాదాపు పూర్తిసామర్థ్యంతో నిండిపోయింది. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్యాన్స్‌తో పాటు సీఎస్‌కే అభిమానులు పెద్ద సంఖ్యలో మ్యాచ్‌కు తరలివచ్చారు. ముఖ్యంగా ధోని నినాదంతో స్టేడియం దద్దరిల్లింది. 'కేవలం ధోని కోసమే ఈ మ్యాచ్‌కు వచ్చాను. ఈ రోజు నీవు బ్యాటింగ్ చేయాలి.. ఎందుకంటే నీవు తొలి వన్డే సెంచరీ సాధించింది ఇక్కడే..'అంటూ అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు. వారు కోరుకున్నట్టు గానే ధోనీ చివర్లో బ్యాటింగ్‌కు దిగి.. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానులకు కావాల్సినంత ఉత్సాహం నింపాడు. డేవిడ్ వార్నర్ అభిమానులు సైతం ఆయన ఫొటోలు ప్రదర్శిస్తూ కేరింతలు కొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున వార్నర్, రిషబ్ పంత్, పృథ్వీషా 'రన్' రంగం సృష్టించగా.. చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున రహానే, మిచెల్, ధోని అలరించారు. వార్నర్ ఇచ్చిన క్యాచ్‌ను పక్షిలా ఎగురుతూ పతిరన పట్టిన క్యాచ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. తుదకు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టే పైచేయి సాధించి 20 పరుగుల తేడాతో నెగ్గి గెలుపు బోణీ కొట్టింది.







తగ్గేదేలే..



స్టేడియం బయట కోలాహలం

విహారయాత్రలో విషాదం

పొల్లూరు జలపాతంలో పడి వ్యక్తి మృతి



కొండయ్య మృతదేహం

మోతుగూడెం: విహారయాత్ర కాస్త విషాదంగా మారింది. చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు జలపాతం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం రంగంపేట మండలం కొత్తపల్లి ప్రాంతానికి చెందిన 25 మంది ప్రత్యేక బస్సులో విహార యాత్ర నిమిత్తం పొల్లూరు వచ్చారు. అక్కడనుంచి వారంతా జలపాతం వద్దకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. వీరంతా బండరాళ్లపై నుంచి వస్తుండగా రంగంపేట మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన వై.కొండయ్య (33) ప్రమాదవశాత్తూ కాలుజారి జలపాతంలో పడిపోయాడు. హుటాహుటిన అతనిని బయటకు తీసిన స్నేహితులు ఏపీ జెన్‌కో భవ్య ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్ స్వర్ణ భార్గవ్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. విహారయాత్రకు వచ్చిన వీరంతా రంగంపేట మండలంలోని లిక్కర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అప్పన్న సన్నిధిలో గంగూలీ



కప్పస్తంభం వద్ద గంగూలీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఐపీఎల్ ఢిల్లీ టీమ్ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి గంగూలీకి పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

పేదలంటే చంద్రబాబుకు అసూయ



మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: పేదలంటే చంద్రబాబుకు అసూయ అని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు విమర్శించారు. జి.మాడుగులలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు సీఎం జగనన్న టికెట్ ఇవ్వడాన్ని ఓర్వలేక ఆయన దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. పేదవాడి అభివృద్ధిని కోరుకునే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని, పెత్తందారులు బాగుండాలనుకునే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. టీడీపీ తరఫున పోటీచేస్తున్న పెత్తందారులందరికీ ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదని హెచ్చరించారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం

- బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకుల దుర్మరణం
- వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఘటన
- దారికాసి కబళించిన మృత్యువు
- మృతుల్లో ఒకరు విశాఖ నగరవాసి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు



మార్చురీ వద్ద రోదిస్తున్న చిరంజీవి తల్లి, కుటుంబ సభ్యులు



చిరంజీవి శంకరరావు మృతదేహాలు



మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: వారిద్దరు స్నేహితులు.. కలిసి మెలిసి ఉండేవారు.. వివాహ వేడుకకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్న వీరు ప్రాణాలు కోల్పోయారు. మృత్యువు వీరి స్నేహబంధాన్ని విడదీయలేకపోయింది. ఆయా కుటుంబాలకు తీరని విషాదం మిగిల్చింది. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ సంతగండు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరు గ్రామానికి చెందిన చిరంజీవి, విశాఖ నగరంలోని కైలాసపురానికి చెందిన లగుడు శంకరరావు మృతిచెందారు.

సంఘటన స్థలంలో ఒకరు..
ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు..

విశాఖ నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న వీరిద్దరు ఈనెల 29న మేడూరు వచ్చారు. ఆరోజంతా అక్కడే సంతోషంగా గడిపారు. మరుసటి రోజు పాడేరు మండలం సంతగుండులో వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తరువాత అదే రోజు రాత్రి 1.30 గంటల సమయంలో బైక్‌పై మేడూరు బయలుదేరారు. సంతగండు ప్రధాన రహదారి వచ్చేసరికి బైక్‌పై ఎదురుగా వస్తున్న జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి గ్రామానికి చెందిన సాగెని ప్రదీప్ ఢీకొట్టాడు. దీంతో చిరంజీవి, శంకరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చిరంజీవి సంఘటన స్థలంలో మృతి చెందాడు. శంకరరావును 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. తీవ్రంగా గాయపడిన ప్రదీప్‌ను అత్యవసర వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

చదువు పూర్తి చేసుకుని వస్తాడనుకుంటే..

మృతుల్లో చిరంజీవి ఆదివాసీ కుటుంబానికి చెందిన వాడు. అతని తండ్రి కొర్రా శివకు వ్యవసాయమే జీవనాధారం. ఆయనకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమార్తెలు కాగా చివరి సంతానం చిరంజీవి. అతనిని ప్రయోజకుడిని చేయాలని శివ కలలు కన్నారు. ఇంటర్ పాసైన అతనిని విశాఖ నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ చదివిస్తున్నారు. తృతీయ సంవత్సరం చదువుతున్న చిరంజీవి కొద్ది రోజుల్లో ఫైనల్ పరీక్షలు రాసి ఇంటికి రానున్నాడు. ఇలా ఎన్నో ఆశలు పెట్టుకున్న ఒకగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాద రూపంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. చిరంజీవి మరణవార్త తెలుసుకున్న వారు పాడేరులో మార్చురీ వద్దకు తరలివచ్చారు. వారి రోదనలతో అక్కడ విషాదకర వాతావరణం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం చిరంజీవి, శంకరరావు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదివారం ఉదయం స్థానిక జిల్లా ఆస్పత్రికి వచ్చారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు దన్నేటి పలాసి రాంబాబు వారిని పరామర్శించారు.

నిఘా నేత్రానికి దొరికిపోయారు

- శ్రీకాకుళంలో బంగారం దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు
- వృద్ధురాలిని మంచానికి కట్టేసి బంగారం దోచుకెళ్లిన దుండగులు
- సాంకేతిక సాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు
- 25 తులాల బంగారం రికవరీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శృతి, వెనుక నిందితులు

శ్రీకాకుళం క్రైం : ఐదు నెలల కిందట పథక రచన చేశారు. నెల రోజుల పాటు రెక్కీ చేశారు. అదను చూసి వృద్ధురాలి ఇంటిలోకి జొరబడి ఆమెను కట్టేసి పాతిక తులాల బంగారం దోచుకున్నారు. జిల్లా కేంద్రంలో శ్రీకాకుళంలో కలకలం రేపిన ఈ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మార్చి 2న జరిగిన ఈ ఘటనలో నిందితులైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని భద్రాచలం గ్రామానికి చెందిన చల్లా జంపన్న, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పొద్దుటూరి సాంబశివరావులను పోలీసులు అరెస్టు చేసి బంగారాన్ని రికవరీ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ యర్రగుంట శృతి ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు..

బెట్టింగులతో అప్పులుండటంతో..

జంపన్న, సాంబశివరావు ఇద్దరికీ క్రికెట్ బెట్టింగ్, పేకాట అలవాటు ఉంది. ఈ అలవాటే వీరిద్దరినీ కలిపింది. మొదట్లో డబ్బులు వచ్చినా క్రమేపీ ఈ వ్యసనం వల్ల ఇద్దరూ అప్పుల్లో కూరుకుపోయారు. శ్రీకాకుళం అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటే మీ కష్టాలు తీరుతాయని ఓ జ్యోతిష్యుడు చెప్పడంతో ఆరు నెలల కిందట జిల్లాకు వచ్చారు. స్వామిని దర్శించుకుని తిరిగి వెళ్లిపోతుండగా.. బొంతావారి వీధికి చెందిన బమిడిపాటి జగదాంబ ఒంటి నిండా బంగారు నగలతో వీరి కంటికి కనిపించింది. దీంతో ఆ బంగారాన్ని దోచుకునేందుకు వీరిద్దరూ ప్లాన్ వేశారు. మెల్లిగా మాటామాటా కలిపి కుటుంబ విషయాలు తెలుసుకుని లగేజీ మోసేందుకు సాయపడినట్లుగా నటించి వెంబడించారు. ఆమె కుటుంబం, ఇల్లు, దినచర్య అన్ని వివరాలను తెలుసుకున్నారు.

రెక్కీ ఇలా..

బంగారం దోచుకునేందుకు నెల రోజులు రెక్కీ చేశారు. దొంగతనం కనిపించకుండా ఉండేందుకు ఫిబ్రవరి 13 రాత్రి బాధితురాలి పక్కింటిలో ఉన్న సీసీ ఫుటేజీకి పెయింటింగ్ వేయడం, మళ్లీ ఫిబ్రవరి 27 రాత్రి నల్లరంగు పెయింటింగ్ వేయడం పోలీసులు ఫుటేజీలో చూశారు. చివరికి మార్చి 2 ఉదయం 11:15 గంటలకు వారు అనుకున్నది సాధించారు. శివ కోవెల పూజారి పెళ్లి కార్డు ఇచ్చారంటూ లోపలికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు.

సీసీ ఫుటేజీలే పట్టించాయి..

బాధితురాలు పోలీసులకు చెప్పిన కోణంలో ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ గణేష్ దర్యాప్తు ప్రారంభించి సీసీ ఫుటేజీలన్నీ పరిశీలించారు. బాధితురాలి ఇంటినుంచి 50 మీటర్ల దూరంలో ఉన్న రెవెన్యూ మంత్రి పీఏ ఇంటి సమీప సందులో ఉన్న ఆయుర్వేద, అల్లోపతి షాపులకున్న సీసీ కెమెరాల్లో నిందితులు మాస్కులు తీసేయడంతో స్పష్టంగా కనిపించారు. అక్కడి నుంచి పందుంపుల్ల కూడలి వద్ద సీసీ కెమెరాలో ఆటో ఎక్కి మున్సిపల్ కార్యాలయం దిగి మార్కెట్‌లో తిరిగి మసీదుకు చేరి అక్కడ నుంచి రిమ్స్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. రిమ్స్ నుంచి మళ్లీ శ్రీకూర్మం వెళ్లి సాయంత్రం ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు చేరి రైలులో పరారైనట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతికత సాయంతో ఇద్దరి చిరునామాలను తెలుసుకున్నారు.

దొంగిలించిన సొత్తును ఏం చేశారంటే..

దొంగిలించిన బంగారాన్ని వారి గ్రామాల్లో ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తెచ్చుకున్నారు. నగలు వేరే వారి దగ్గర కరిగించేసి రెండు దిమ్మలుగా అచ్చు పోయించి తలో ఒకటి తీసుకుని బయట అమ్మేందుకు ప్రయత్నించారు. వృద్ధురాలి పరిస్థితి తెలుసుకునేందుకు వారు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయం వద్ద పార్కులో నిందితులు ఉన్నారన్న సమాచారంతో సీఐ, ఎస్‌ఐలు తమ బృందంతో మాటువేసి పట్టుకుని అదుపులో తీసుకున్నారు. జంపన్న నుంచి 150 గ్రాములు, సాంబశివరావు నుంచి 141 గ్రాముల బంగారు ముద్దలను, వృద్ధురాలిని బెదిరించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శృతి సీఐ సన్యాసినాయుడు,ఎస్‌ఐ గణేష్‌లు చాకచక్యంగా కేసును ఛేదించారని అభినందించడమే కాక సహకరించిన పీసీలు ఎస్ రవికుమార్, పి.సూరిబాబు, సిహెచ్ హరీష్‌కుమార్, డి.తులసిలకు రివార్డులు అందించారు.

పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లి పెద్ద పైపులైన్‌కు చెందిన గోకడ సుబ్బలక్ష్మి కిడ్నీ, హృద్రోగ సమస్యకు వైద్య సేవలు పొందినందుకుగాను సీఎం సహాయ నిధి నుంచి రూ.75 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని ఆమెకు ఎమ్మెల్యే చెక్కు రూపంలో అందజేశారు.

గంజాయి మత్తులోనే విద్యార్థి హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

ఎటపాక: వెంకటరెడ్డిపేట జాతరలో గంజాయి మత్తులోనే నిందితులు టెన్త్ విద్యార్థులపై కత్తులతో దాడి చేసి, ఒకరిని హత్య చేశారని సీఐ డి. రామారావు తెలిపారు. ఆదివారం ఎటపాకలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులు భద్రాచలం పట్టణానికి చెందిన ముగ్గురు మైనర్లను, ముగ్గురు మేజర్లను పట్టుకున్నామన్నారు. వీరు మద్యం, గంజాయికు బానిసై ఒంటరిగా వెళ్తున్న వారిని దారిలో కత్తులు కర్రలతో బెదిరించి డబ్బులు దోచుకునేవారని తెలిపారు. ఇదే క్రమంలో జాతరకు వచ్చిన రామగోపాలపురానికి చెందిన టెన్త్ విద్యార్థి సాయికుమార్ బహిర్భూమికి వెళ్తుండగా, నిందితులు వాటర్ బాటిల్ లాక్కోవటంతో గొడవ జరిగిందన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసులను ఎస్పీ తుహీన్‌సిన్హా, అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారని తెలిపారు. ఎస్సై కె. పార్థసారథి పాల్గొన్నారు.

యువ న్యాయవాదుల 'నేస్తం'

- నెలకు రూ.5 వేల చొప్పున అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఏడాది రూ.60 వేలు చొప్పున మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల సాయం
- సీఎం జగన్‌తోనే మేలు.. జూనియర్ లాయర్ల హర్షం

2023లో లా నేస్తం తీసుకున్న యువ న్యాయవాదుల వివరాలివీ..

జిల్లా పేరు	బీసీ	ఓసీ	ఎస్సీ	ఎస్టీ	మొత్తం	లబ్ధి (లక్షల్లో)
అల్లూరి సీతారామరాజు	1	0	5	7	13	రూ.7.80
అనకాపల్లి	45	14	6	1	66	రూ.39.60
విశాఖపట్నం	99	43	23	1	166	రూ.99.60
మొత్తం	145	57	34	9	245	రూ.1.47 (కోట్లు)



విశాఖ లీగల్/అల్లిపురం: అప్పుడే చదువులు పూర్తై కోర్టుల్లో అడుగుపెడుతున్న తరుణంలో.. యువ న్యాయవాదులు తమ కాళ్ల మీద నిలబడేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించింది. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ.. వృత్తిలో స్థిరపడేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ లా నేస్తం' మంచి ఫలితాలనిచ్చింది. 2019 తర్వాత జూనియర్ న్యాయవాదుల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ లా నేస్తం పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఇలాంటి పథకం కేవలం మన రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉందని యువ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అడ్వకేట్లకు అన్ని రకాలుగా మంచి జరగాలనే ఉద్దేశంతో రూ.100 కోట్లతో అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ ట్రస్ట్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సీఎం జగన్‌తో న్యాయవాదులకు మేలు



2010కి ముందు జూనియర్ న్యాయవాదులు అధికంగా ఉండేవారు. ఆ తర్వాత క్రమంగా వారి సంఖ్య తగ్గింది. 2019 నాటికి న్యాయవాది వృత్తి అంటేనే భయంతో చాలా మంది దూరమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో పాదయాత్రలో జగన్ ఇచ్చిన మాట ప్రకారం లా నేస్తం కింద ఇప్పటి వరకు రూ.42 కోట్ల వరకు విడుదల చేసి అండగా నిలిచారు. న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. గతంలో న్యాయవాదులకు ఏదైనా ప్రమాదం జరిగితే రూ.5 లక్షల వరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ అందించేది. జగన్ సీఎం ఈ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచారు. కోవిడ్ సమయంలో న్యాయవాదులను ఆదుకున్న తీరు ప్రశంసనీయం. ఎటువంటి షరతులు లేకుండా రూ.25 కోట్ల రుణం అందించారు. న్యాయవాదుల బీమా సౌకర్యానికి నిధులు అందజేస్తున్నారు.

– జీఎం రెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్

మలుపుతిప్పిన లా నేస్తం



న్యాయవాది కావాలన్నది నా బలమైన కోరిక. ఆర్థిక సహాయం లేకపోవడం వల్ల నాకు వచ్చిన పౌరోహిత్యంతో కాలం గడుపుతున్నాను. లా చదువుకుని ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి ఉండేవాడిని. అలాంటి పరిస్థితుల్లో అమల్లోకి వచ్చిన వైఎస్సార్ లా నేస్తం.. నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. లా నేస్తం కింద నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాది రూ.60 వేలను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లా ప్రాక్టీస్ మొదలు పెట్టాను. ప్రస్తుతం సీనియర్ల వద్ద వృత్తిలో మెలకువలు నేర్చుకుంటున్నాను. లా నేస్తం వల్ల నా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గింది. ఇంత సహాయం అందిస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– జి.ఆనంద భార్గవ్ శర్మ, జూనియర్ న్యాయవాది

మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది



నేను ఇంజినీరింగ్ చేసి న్యాయవాద వృత్తిని చేపట్టాను. 2001 నుంచి నాకు లా నేస్తం అందుతోంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.5 వేలు అందజేస్తోంది. ఈ డబ్బులతో నా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడంతో పాటు పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాను. అమ్మానాన్నల మీద ఆధారపడకుండా ఈ డబ్బులు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతిరోజూ కోర్టుకు వెళుతూ న్యాయవాది వృత్తిలో రాణిస్తున్నాను. ఈ పథకం కేవలం మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఇది ప్రతిపాదనలోనే ఉండగా.. మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ అభినందనీయం. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎ.సాయి మౌనిక, జూనియర్ న్యాయవాది

మంచి ఆలోచనతో అమలు



జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం ప్రోత్సాహంగా నిలిచింది. ఆర్థికంగానూ, వృత్తి పరంగానూ నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి ఆలోచనలతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలిచింది లేదు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒకరిద్దరికి మాత్రమే ప్రోత్సాహం అందేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హత గల జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ద్వారా అండగా నిలిచారు.

– ఎ.కొండాజీ, జూనియర్ న్యాయవాది, విశాఖపట్నం బార్ అసోసియేషన్

జూనియర్లకు పెద్ద గిఫ్ట్



ఇప్పుడిప్పుడే న్యాయవాది వృత్తిని ప్రారంభించిన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు ప్రోత్సాహంగా లా నేస్తం ఇవ్వడం పెద్ద గిఫ్ట్. నేను కొత్తగా న్యాయవాది వృత్తిలోకి ప్రవేశించాను. నాకు ఓ నెల లా నేస్తం వచ్చింది. జూనియర్ న్యాయవాదులకు ఎటువంటి కేసులు ఉండవు. నేర్చుకునే సమయంలో ప్రభుత్వం రూ.5 వేలు ప్రోత్సాహకం అందించడం వల్ల మాలాంటి వారికి చాలా మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఎం.వెంకటేష్, జూనియర్ న్యాయవాది

నాటు తుపాకుల అప్పగింత


స్టేషన్‌కు వచ్చిన నాటు తుపాకులను చూపిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ రఘునాథరావు

చింతపల్లి రూరల్: గిరిజనులు స్వచ్ఛందంగా 16 నాటు తుపాకులను అప్పగించినట్టు ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. మండలంలో అంజలి శనివారం, కిటుముల పంచాయతీల పరిధిలోని గిరిజనులు వేట కోసం వినియోగిస్తున్న నాటు తుపాకులను ఆదివారం అప్పగించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు తుపాకులు, ఆయుధాలు ఎవరి దగ్గరైనా ఉంటే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలని ఆయన కోరారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి పోలీసుస్టేషన్ల పరిధిలో పది నాటు తుపాకులను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అప్పగించినట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. జడ్డంగి స్టేషన్ పరిధి మారేడుబాక గ్రామం నుంచి ఐదు, వంచంగి నుంచి ఒకటి, ఓకుర్తి నుంచి రెండు, రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలోని లక్కవరప్పాడు నుంచి రెండు తుపాకులు అప్పగించారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఈరెండు స్టేషన్ల పరిధిలో 25 తుపాకులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఎస్ఐలు రఘునాథరావు, వెంకయ్య పాల్గొన్నారు.

నవోదయకు చినమట్టపల్లి విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని వినీష

వీఆర్‌పురం: నవోదయ ప్రవేశ పరీక్షలో మండలంలోని చినమట్టపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని సోడె వినీష ఎంపికైందని హెచ్ఎం సోడె నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారని, వారందరికీ ఆర్నెల్లపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఉపాధ్యాయినులు టి.విజయకుమారి, జి.మీనా ప్రత్యేకంగా మ్యాథ్స్ బోధించడం వల్ల వినీష సులభం పాసయిందన్నారు. తమ పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందని ఆనందం వ్యక్తం చేశారు.

పది 'స్పాట్' రెమ్యునరేషన్ పెంపు

- ఒక్కో పేపర్ దిద్దేందుకు రూ.6.60లు నుంచి రూ.10కు పెంపు
- స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137 నుంచి రూ.300
- రెమ్యునరేషన్ పెంపుపై సర్వత్రా హర్షం
- నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం


స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారులకు పెంచిన రెమ్యునరేషన్ చెల్లించేందుకు విద్యాశాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 2016లో నిర్ణయించిన రేట్ల ప్రకారమే స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొనే వారికి పారితోషికం చెల్లించేవారు. దీనిపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, నాటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ పెంపుపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుంది.

ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతేడాది నుంచి రెమ్యునరేషన్ పెంపు అమల్లోకి వచ్చింది. ఉపాధ్యాయులకు సకాలంలో పారితోషికం చెల్లించేందుకు సైతం జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెమ్యునరేషన్ పెంపు ఇలా..

ఒక్కో పేపరు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు గతంలో రూ.6.60లు ఇవ్వగా, దీన్ని రూ.10కు పెంచారు. రోజుకు 40 పేపర్ల వరకు దిద్దేందుకు అవకాశం ఉండటంతో, ఎంతలేదన్నా రూ.264లు పారితోషికం లభించనుంది. క్యాంప్ ఆఫీసర్‌కు రూ.385 నుంచి రూ.578కు పెంచారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.330 నుంచి రూ.495లకు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.286ల నుంచి రూ.429లకు పెంచారు. ఎస్ఏలకు రూ.137.50లు నుంచి రూ.300లకు, సీఈలకు రూ.264 నుంచి రూ.396లుకు పెంచారు. ఎగ్జామినర్‌కు రూ.250లు నుంచి రూ.375కు పెంచారు. పరీక్షల ఇన్విజిలేషన్ విధుల్లో పాల్గొన్న వారికి కూడా గతంలో కన్నా రెమ్యునరేషన్ పెంచారు.

స్పాట్‌పై ఉపాధ్యాయుల్లో ఆసక్తి

ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాల వాల్యుయేషన్‌కు అసిస్టెంట్ ఎగ్జామినర్లు 600 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 320 మంది, చీఫ్ ఎగ్జామినర్లుగా 90 మందికి విధులు కేటాయిస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఉత్తర్వులు జారీ చేశారు.

హర్షణీయం



పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, సిబ్బందికి రెమ్యునరేషన్ పెంచి, వాటిని సకాలంలో చెల్లించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం హర్షణీయం. అత్యవసర కారణాలు చూపే వారికి స్పాట్ విధుల్లో కొంతమినహాయింపు ఇవ్వాలి. దీనిపై ఇప్పటికే డీఈవో దృష్టికి తీసుకువెళ్లాం.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, విశాఖపట్నం

ఉపాధ్యాయులకు ప్రయోజనం



స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనం బాగుంది. గతంలో అయితే స్పాట్ విధులు మాకొద్దు అనే పరిస్థితులు ఉండేవి. కానీ అందరికీ ఆమోదకరమైన రీతిలో రెమ్యునరేషన్ ఇస్తుండటంతో ఉపాధ్యాయులు సంతోషంగానే విధుల్లో పాల్గొంటున్నారు.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

బరజోల కష్టాలకు మోక్షం...

- రూ.1.20 కోట్లతో సీసీరోడ్డు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గిరిజనుల కృతజ్ఞతలు


మట్టి రహదారిపై రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు (ఫైల్)


బరజోల కొండ ప్రాంతంలో వేసిన సీసీరోడ్డు

అనంతగిరి: దశాబ్దాలుగా గిరిజనులు పడుతున్న కష్టాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోక్షం కల్పించింది. ఎత్తయిన కొండ ప్రాంతమైన బరజోల గిరిజన గ్రామానికి గతంలో రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్య, వైద్యం, రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు అష్టకష్టాలు పడేవారు. గ్రామంలోని ఎవరైనా అనారోగ్యానికి గురైతే నాలుగు కిలోమీటర్ల మేర కాలిబాటన తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ కష్టాలకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. గ్రామానికి ఇటీవలే ట్రైబల్ వెల్ఫేర్ నుంచి మంజూరైన రూ.1.20 కోట్లతో సీసీరోడ్డు నిర్మించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారం...

బరజోల గ్రామానికి రహదారి సమస్య పరిష్కరించడం వల్ల అరకు–విశాఖ ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణికులకు మేలు చేసినట్టే.. ప్రధాన రహదారి అనుకునే బరజోల గ్రామానికి రహదారి ఉంది. నాలుగు నెలల క్రితం వర్షాలకు కొండప్రాంతం నుంచి ప్రధాన రహదారిపై మట్టి కొట్టుకువచ్చి పేరుకుపోవడంతో ఆ రాత్రంతా తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొండ ప్రాంతంలోని నేడు సీసీరోడ్డు నిర్మాణం కావడంతో మట్టి వచ్చే పరిస్థితి లేదు. దీంతో పెద్ద సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై చంద్రబాబు వ్యాఖ్యలు గర్హనీయం

- అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో నిరసన


హుకుంపేటలో మానవహారంగా ఏర్పడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నాయకులు

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ సింగనమల అసెంబ్లీ టికెట్ టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులకు కేటాయించడంపై చంద్రబాబునాయుడు చులకన భావంతో చేసిన విమర్శలు గర్హనీయమని అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. ఆదివారం ఆయన నాయకులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మోదకొండమ్మ ఆలయం ఎదురుగా ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా మత్స్యలింగం మాట్లాడుతూ బలహీన వర్గాలంటే చంద్రబాబుకు తొలినుంచి చిన్నచూపే అన్నారు. ఉన్నత విద్యనభ్యసించిన వీరాంజనేయులకు చంద్రబాబు హయాంలో ఉద్యోగం రాకపోవడం వల్లే టిప్పర్ డ్రైవర్‌గా మారి తన కుటుంబాన్ని పోషిస్తున్న విషయం గుర్తించుకోవాలన్నారు. జగనన్న అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తూ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంపై చంద్రబాబు ఓర్వలేక ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మరోసారి ఓడించి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి భూషణ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండలరావు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు సదాశివరాజు, రాజారావు, మహేష్, వెంకట్, నాగేష్ పాల్గొన్నారు.

నృసింహ వైభవం

- ఐదో రోజు శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ మహాయజ్ఞం
- వేద మంత్రోచ్చరణలతో ప్రతిధ్వనించిన సింహగిరి
- నేడు మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో పరిసమాప్తం


పాల్గొన్న ఉభయదాతలు


సుదర్శన నారసింహ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహాయజ్ఞం ఐదోరోజు వైభవంగా కొనసాగింది. ఆదివారం కావడం, యజ్ఞంలో పాల్గొనేందుకు ఆఖరిరోజు కావడంతో పెద్ద ఎత్తున ఉభయదాతలు సింహగిరికి తరలివచ్చారు. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలతో యజ్ఞ ప్రాంగణం కిటకిటలాడింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి యజ్ఞ ఘట్టాలను దేవస్థానం అర్చకులు, రుత్వికులు నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలో, చక్రపెరుమాళ్‌ను మరో పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ని ఒక వేదికపై, స్వామివారి ఉత్సవ మూర్తులను మరొక వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలకు కంకణధారణ చేసిన అనంతరం యజ్ఞశాలలో ఐదు హోమకుండాల వద్ద యజ్ఞాన్ని నిర్వహించారు. ఉభయదాతల చేత అష్టోత్తర శతనామావళితో స్వామివారి పూజ చేయించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించి, ప్రసాదం అందజేశారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తుల చెంత రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహాత్మ్యం, సుదర్శన శతకాలను వైదికులు పఠించారు. విశేష హారతులు అందజేశారు. ఉభయదాతలకు దేవస్థానం తరఫున శాలువా, రవిక, కల్యాణం లడ్డు, పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు మహాపూర్ణాహుతి

సుదర్శన నారసింహ మహా యజ్ఞం సోమవారం పరిసమాప్తం కానుంది. ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి, తదుపరి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. యజ్ఞం ముగింపును పురస్కరించుకుని అన్నప్రసాదాన్ని అందించే ఏర్పాటు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి చిరంజీవి చౌదరి


అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న చిరంజీవి చౌదరి

చింతపల్లి రూరల్: అడవి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి సూచించారు. ఆదివారం ఆయన స్థానిక డివిజనల్ అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. అటవీ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్వీ నగర్ పాత టేకు ప్లాంటేషన్, చింతలూరు కలప డిపోను సందర్శించారు. గిరిజనులు అటవీశాఖకు సహకరించాలని సూచించారు. ఎక్కడైనా మంటలు సంభవిస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు. కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల విలువైన అటవీ సంపద బూడిద అవుతుందన్నారు. అడవుల్లో నీటి వనరులు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, చింతపల్లి డీఎఫ్‌వోలు వినోద్‌కుమార్, సూర్యనారాయణ, స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందర్, సీసీఎఫ్ శ్రీకాంత్‌నందరెడ్డి, సబ్ డీఎఫ్‌వో ఎస్ఎస్‌వీ రాజు, వివిధ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.